క్లుప్తంగా

తైబజార్ లీజు వేలం వాయిదా

● మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి



టెండర్ వేస్తున్న డిపాజిట్‌దారుడు

పరకాల : సరైన వేలం రాకపోవడంతో పరకాల తైబజార్ లీజు వేలం పాటను ఈనెల 30కి వాయిదా వేస్తున్నట్లు స్థానిక మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి ప్రకటించారు. 2023–24 సంవత్సరానికి గాను పట్టణంలోని తైబజార్ లీజు కోసం టీపీఓ రాజు పర్యవేక్షణలో శనివారం సీల్డు టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. ముగ్గురు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నప్పటికీ సరైన వేలం రాకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి నష్టం జరిగే అవకాశం ఉండడంతో 30కి వాయిదా వేస్తూ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ బిల్ కలెక్టర్ తిరుపతి, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరామర్శ



కమలాపూర్ : మండలంలోని గూనిపర్తి, కమలాపూర్ గ్రామాలను కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి శనివారం సందర్శించి రెండు కుటుంబాలను పరామర్శించారు. తొలుత ఆయన గూనిపర్తి మాజీ సర్పంచ్, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వడ్డె చంద్రమౌళి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రమౌళి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. చంద్రమౌళి మృతి బాధాకరమన్నారు. అనంతరం కమలాపూర్‌కు చెందిన ప్రముఖ సామిల్ వ్యాపారి నేరెళ్ల సాంబయ్య గౌడ్ ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబాన్ని సమ్మిరెడ్డి పరామర్శించారు. ముందుగా సాంబయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, మాజీ డైరెక్టర్ రాంచందర్, నాయకులు పుల్లూరి శ్రీనివాసరావు, ఆవుల తిరుపతి తదితరులున్నారు.

‘ఇనగాల ట్రస్ట్’ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



నడికూడ : కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆదేశాల మేరకు మండలానికి చెందిన ఇద్దరు మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. తొలుత నర్సక్కపల్లె గ్రామానికి చెందిన పెద్ద సాంబయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ శనివారం ఆర్థిక సాయం అందించారు. అనంతరం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన పెగడ కనకలక్ష్మి ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబీకులకు సాయం అందించారు. రెండు కుటుంబాలనూ దేవేందర్ పరామర్శించారు. పేద కుటుంబాలకు ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, రాజు, సుమన్, తిరుపతిరెడ్డి, విష్ణు, రాజయ్య, సంతోష్, ఐలయ్య, రజనీకర్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి



హన్మకొండ చౌరస్తా: భారతదేశ మొట్టమొదటి ప్రధాని దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) భవన్‌లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బంక సరళ మాట్లాడారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా నవభారతానికి పునాదులు వేసిన మహనీయుడు నెహ్రూ అని కొనియాడారు. దేశ ప్రజల కోసం నెహ్రూ కుటుంబం జీవితాలను అంకితమిచ్చిందని గుర్తు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్, సతీష్, సంపత్, అంకూస్, జాఫర్, సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, సారంగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ విద్య

● డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

పరకాల : ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేలా మండలంలోని పలు గ్రామాల్లో అధ్యాపకులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరితే కలిగే ప్రయోజనాలను ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. అత్యున్నత విద్యార్హతలు, సుదీర్ఘ అనుభవం కలిగిన అధ్యాపకులు విద్యాబోధన అందిస్తారని చెప్పారు. ప్రభుత్వం అనేక జనరల్, వృత్తివిద్యా కోర్సులు అభ్యసించే అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరితే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని సూచించారు. ఎన్‌సీసీ, టీఎస్‌కేసీ వంటి విభాగాల ద్వారా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. మండలానికి చెందిన అర్హులైన విద్యార్థులందరూ ‘దోస్త్’ ద్వారా తప్పకుండా గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు దుప్పటి సంజయ్, రాజు, కళాశాల సిబ్బంది విక్రమ్, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



పరకాల : విద్యార్థినితో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్

పరిరక్షణ, వికాసమే ధ్యేయం

ధర్మసాగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిరక్షణతోపాటు విద్యార్థుల వికాసమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆస్నాల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని సాయిపేట, నారాయణగిరి, సోమదేవరపల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు, అధ్యాపకులతో కలిసి శనివారం ఇంటింటికీ తిరుగుతూ ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాల కోసం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడారు. కళాశాలలో అత్యున్నత అర్హతలు కలిగిన అధ్యాపకులు బోధిస్తున్నారని, గుణాత్మక విద్యను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులను చేర్పడం ద్వారా ప్రభుత్వ కళాశాలలను పరిరక్షించడంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఆర్టీసీ బస్సు సదుపాయం లేదన్న విషయాన్ని పలువురు తల్లిదండ్రులు తెలియజేయగా ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి బస్సు నడిచేలా చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఐదుగురు విద్యార్థులను ప్రిన్సిపాల్ స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాబురావు, రాములు, వెంకట్, సదానందం, గోపాలకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ : విద్యార్థినికి అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

రాజీవ్‌గాంధీ ఆశయాల విస్తృతే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయాలను విస్తృతపర్చడమే లక్ష్యంగా ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. జూన్ 18న తలపెట్టిన రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్‌ను భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామంలోని తన నివాసంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో కోహెడ మండలానికి చెందిన పలువురు యువకులు ప్రవీణ్‌రెడ్డి సమక్షంలో ఎన్‌ఎస్‌యూఐలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయాలను యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ క్విజ్ పోటీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యువకులు చురుకుగా పాల్గొనాలని కోరారు. అందుకోసం 7661899899 సెల్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే సదరు మొబైల్‌కు లింక్ వస్తుందని, ఆ లింక్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో యువత చురుకుగా పాల్గొనాలని సూచించారు. పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌రెడ్డి, అరవిందచారి, రంజిత్‌రెడ్డి, కార్తీక్, వివేక్‌రెడ్డి, రమేష్, రాకేష్, ధనుష్, శ్రీధర్, ప్రశాంత్, హనుమంత్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రవీణ్‌రెడ్డి, తదితరులు

క్వారీ అనుమతిని రద్దు చేయాలని నిరసన

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలో మైనింగ్ క్వారీ కోసం జారీ చేసిన అనుమతులను రద్దు చేయాలని ఉపసర్పంచ్ పుట్ట వెంకట్రాజం, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ బుద్దె రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో ప్రజలు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాజం, రమేష్ మాట్లాడారు. గ్రామంలో మైనింగ్ క్వారీ ఏర్పాటు వల్ల ముదిరాజ్ కులస్తులు వినియోగించుకుంటున్న ప్రభుత్వ భూములను కోల్పోతారని, జీవనోపాధికి నష్టం వాటిల్లుతుందని ఆందోళన వెలిబుచ్చారు. అలాగే గ్రామం నుంచి మీదుగా ప్రయాణించే భారీ వాహనాలతో కాలుష్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. జిల్లా కలెక్టర్, మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి మైనింగ్ క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న ఉపసర్పంచ్, తదితరులు

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



దామెర : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆత్మకూరులో..

దామెర : పేద రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ 1న మడికొండలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండలంలోని దమ్మన్నపేట్‌లో శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీ మేరకు రెడ్డి కులస్తులను ఆదుకునేలా బడ్జెట్ నుంచి రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు. జూన్ 1న తలపెట్టిన సభకు మండలంలోని కులస్తులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వీసం రమణారెడ్డి, పుల్యాల రఘుపతిరెడ్డి, మన్నెం ఇంద్రారెడ్డి, గంకిడి బుచ్చిరెడ్డి, ఎస్‌రెడ్డి నర్సింహారెడ్డి, చొల్లేటి రాజిరెడ్డి, వేముల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు : జూన్ 1న హనుమకొండ జిల్లాలోని కాజీపేట శివారులోని మడికొండలో నిర్వహించనున్న రెడ్డి సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రేవూరి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రెడ్డి కులస్తుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, రెడ్డి కార్పొరేషన్ సాధన దిశగా సమ్మేళనంలో చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రేవూరి జయపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా రాజు



కమలాపూర్ : ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా భీంపల్లి గ్రామానికి చెందిన భూపతి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు తాటిపల్లి రాజయ్య, మాజీ ఉపాధ్యక్షుడు తోట సురేష్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించి మండలంలోని అన్ని గ్రామాల ఆర్యవైశ్య కులపెద్దల సమక్షంలో మండల కేంద్రంలో కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా తాటిపెల్లి శ్రీనివాస్, చకిలం దయాకర్, వెనిశెట్టి కాంతినాథ్, ప్రధాన కార్యదర్శిగా సుద్దాల కార్తీక్, సంయుక్త కార్యదర్శులుగా దొంతుల నాగేశ్వర్‌రావు, ఉప్పుల శివప్రసాద్, కోశాధికారిగా వెనిశెట్టి శివకుమార్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా తోట సురేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా భూపతి ప్రవీణ్, అయిత ఓంప్రకాష్, సంకీస రమేష్‌బాబు, కొనిశెట్టి సురేష్, వెనిశెట్టి పున్నంచందర్, తొడుపునూరి జగదీశ్వర్, గౌరవ అధ్యక్షుడిగా కొనిశెట్టి మునీందర్, గౌరవ సలహాదార్లుగా కంభంపాటి ప్రసాద్, గుండా లింగమూర్తి, అయిత మల్లయ్య, నూక సాంబమూర్తి, భూపతి చంద్రమౌళి, నూక వీరభద్రయ్య, దొడ్డ రమేష్ ఎన్నికయ్యారు.

ఐక్యఉద్యమాలతోనే ఎస్సీ వర్గీకరణ

● ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సుకుమార్

పరకాల : ఐక్యఉద్యమాలతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్ తెలిపారు. మిషన్ 50 రోజుకు చేరుకోగా మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామ యువకులతో మండల ఇన్‌చార్జ్ అనంత్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో సుకుమార్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యతను విస్మరించి మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గ్రామ స్థాయి నుంచి యువకులు పోరాటాల కోసం ఏకం కావాలని సూచించారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా తిక్క శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ శంకర్, అధికార ప్రతినిధిగా రేణుకుంట్ల శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్

‘ఉపాధి’ పనిదినాలను పెంచాలి

ఆత్మకూరు : ఉపాధి పని దినాలను ఏడాదికి 200 రోజులకు పెంచాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నాగయ్యపల్లె, అక్కంపేట గ్రామాల్లో ఆ ఫ్రంట్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం సురేష్ మాట్లాడారు. ఉపాధి కూలీలు సరైన ఆదాయం దక్కక, ఇతర సమస్యలతో సతమతమౌతున్నారని చెప్పారు. ఉపాధి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కొలతలతో సంబంధం లేకుండా రోజువారీ కూలిని రూ.600లకు పెంచి చెల్లించాలని, పని ప్రదేశాల్లో తాగునీటి, ఇతర మౌలిక వసతులు కల్పించడంతోపాటు కూలీలకు బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జినుక అశోక్, మేకల సాంబయ్య, గిన్నారపు బాబు, భిక్షపతి, రాజు, రజనీకాంత్, సరోజన, వనమాల, కొమురమ్మ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న సురేష్

గూడ్స్ రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



యాదగిరి (ఫైల్)

కాశిబుగ్గ: గూడ్స్ రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ – చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గుడిమహేశ్వరం గ్రామానికి చెందిన భట్టు యాదగిరి(40) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ట్రాక్టర్ కొనుగోలు చేయగా, అది సరిగా నడవక ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం వరంగల్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి ధర్మారం శ్మశాన వాటిక సమీపానికి చేరుకొని బైక్‌ను అక్కడ పెట్టి గూడ్స్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదుతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు.

మహాసభను విజయవంతం చేయండి

ధర్మసాగర్ : ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో హనుమకొండలో జూన్ 4న తలపెట్టిన మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మండల ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ జరగకపోవడం వల్ల మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు చాలా నష్టపోతున్నారని తెలిపారు. వర్గీకరణ సాధన కోసం మాదిగల్లో చైతన్యం పెంచేలా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారని చెప్పారు. ఆయన పర్యటనలో భాగంగా హనుమకొండలో తలపెట్టిన మహాసభకు మాదిగ కులస్తులందరూ తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ బొడ్డు శాంతిసాగర్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ గౌడ్, నాయకులు పాడిశెట్టి ప్రతాప్, పుట్ట ప్రశాంత్, కొట్టి కళ్యాణ్, మాచర్ల బాబు, చిలుక రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగారపు శ్రీనివాస్

కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి

న్యూశాయంపేట: మహిళలు కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడు జానీ దర్శన్‌సింగ్ సూచించారు. హనుమకొండ ములుగురోడ్డు ఎంసీసీ భవన్‌లో శాంతి సంఘం, మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు 3వ బ్యాచ్ ద్వారా ఉచిత కుట్టుశిక్షణ అందించారు. ఈ సందర్భంగా వారికి శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేసి, శిక్షణలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి మూడు కుట్టుమిషన్లను ఉచితంగా అందజేశారు. అనంతరం, మైనారిటీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా దర్శన్‌సింగ్‌ను సభ్యులు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్దిఖీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌డీడీ షాహిద్ మసూద్, మహ్మద్ ఎక్బాల్, లాజరస్, మహ్మద్ ఖలీల్, కౌసర్ ఫారూఖీ, సయ్యద్ అక్బర్, నదీమ్ బేగ్, మాషూఖ్ రబ్బానీ, మసూద్‌మిర్జా, నాజ్రీన్, నసీర్, మహ్మద్ అబ్దుల్ నయీం తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్, సర్టిఫికెట్ అందజేస్తున్న దర్శన్‌సింగ్

ధాన్యం కాంటా వేయడంలో జాప్యం తగదు

ఐనవోలు : ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు జాప్యం చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ అన్నారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సందర్శించి రైతుల సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం మహేందర్ మాట్లాడారు. నందనం సొసైటీ పరిధిలోని ఐనవోలులోని కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతోందని చెప్పారు. కాంటాల కోసం 15 రోజులుగా రైతులు పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. తాలు పేరిట మిల్లర్లు ఇష్టారీతిన తరుగు తీస్తున్నారని చెప్పారు. హమాలీల సంఖ్య పెంచి త్వరగా కాంటాలు పెట్టించాలని, లారీల్లో ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సొసైటీ బాధ్యులను కోరారు.



రైతులతో మాట్లాడుతున్న మహేందర్

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

విద్యారణ్యపురి: హంటర్‌రోడ్డులోని వరంగల్ వెస్ట్ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో 2023 – 2024వ విద్యా సంవత్సరంలో మొదటి దశ ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థినులు అడ్మిషన్లు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ భద్రకాళి శనివారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 1న బీఏ (హెచ్‌ఈసీ), ఎంపీసీఎస్, ఎంఎస్‌టీడీఎస్, 2న బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, 3న బీకామ్ జనరల్, బీకామ్ సీఏలో ప్రవేశాలు పొందాలని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ హాల్‌టికెట్, మెమో, టీయూజీసెట్ –2023 హాల్‌టికెట్, కులం, ఆదాయం, బోనోఫైడ్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

‘బీజేపీని భూస్థాపితం చేసేందుకు కలిసిరావాలి’

న్యూశాయంపేట: బీజేపీని భూస్థాపితం చేసేందుకు కమ్యూనిస్టులతో బీఆర్‌ఎస్ పార్టీ కలిసి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల, గ్రామ శాఖల కార్యదర్శుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ లౌకిక శక్తుల ఐక్యతతోనే దేశంలో బీజేపీని ఓడించవచ్చని వివరించారు. మతోన్మాద చర్యలను ప్రజలు సహించబోరని, అందుకు ఇటీవల కర్ణాటక ఫలితాలే నిదర్శనమని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి కమ్యూనిస్టులకు ఉందని గుర్తుచేశారు. వచ్చేనెల 4న భద్రాద్రి కొత్తగూడెంలో లక్షమందితో ప్రజాగర్జన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, నాయకులు కర్రె భిక్షపతి, తోట భిక్షపతి, ఎల్లేష్, రాములు లక్ష్మణ్, భిక్షపతి, ఓదెలు, రాజమౌళి, రవి, శంకర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

శిక్షణతో మెరుగైన వైద్యసేవలు

మడికొండ: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో వరంగల్ జిల్లా ఆశ కార్యకర్తలకు నిర్వహించిన నవజాత శిశువు, గృహ సందర్శన సంరక్షణ అంశాలపై ఇచ్చిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ హాజరై ఆశ కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల జీవితంలో వివిధ దశల్లో కనిపించే సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించారు. రక్తహీనత, అంటువ్యాధులు, అనారోగ్య సమస్యల బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పిల్లల పోషకాహారం స్థితి, వృద్ధి వంటి తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది డాక్టర్ గోపాలరావు, జ్ఞానసుందరి, ప్రతాపగిరి ప్రసాద్, రజిని, మేరీ, మనోజ, వరమ్మ, స్వరూప పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం వ్యాయామం చేయండి

హన్మకొండ చౌరస్తా: ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతీఒక్కరు రోజుకు అరగంట వ్యాయామం అలవర్చుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండలోని యాదవనగర్ కెనాల్ కట్టపై రూ.5లక్షల మున్సిపల్ నిధుల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు వ్యాయామం అవసరమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, బీఆర్‌ఎస్ పార్టీ 4వ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కంజర్ల మనోజ్‌కుమార్, నాయకులు సిద్దోజు రమేష్, సిద్ధంశెట్టి శ్రీనివాస్, హన్మకొండ భద్రి, నారాయణగిరి రాజు, నేతుల రఘు, బొక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



ప్రశంసపత్రాలు అందజేస్తున్న శ్రీనివాస్

కేయూ క్యాంపస్: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయొచ్చని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. వరంగల్ ఎంజీఎం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడారు. మనిషి జీవితంలో చేసే దానాల్లో రక్తదానం చాలా విలువైనదని వివరించారు. వాకర్స్ స్వచ్ఛందంగా 24 యూనిట్ల రక్తందానం చేశారు. కార్యక్రమంలో దొంతి తిరుపతిరెడ్డి, ఉప్పుల కొమురయ్య, సందీప్, చిలువేరు శంకర్, రాంరెడ్డి, బ్లడ్ మోటివేటర్ రచ్చ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.